

గుడిహత్నూర్‌లో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# బోథ్‌లో బీఆర్ఎస్

- ఆదిలాబాద్‌లో బీజేపీ విజయం
- రెండు పార్టీల శ్రేణుల సంబురాలు

ఆదిలాబాద్, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల మిశ్రమ ఫలితాలు వచ్చాయి. బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ విజయం సాధించగా, ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ విజయం సాధించారు. రెండు నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు టీటీడీసీలో ప్రారంభమైంది. మొదటి పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించారు. అనంతరం స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చిన ఈవీఎంను తీసుకువచ్చి 14 టేబుళ్లలో లెక్కించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ 6,147 ఓట్ల మెజార్టీ సాధించారు. బోథ్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ 23,023 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆదిలాబాద్ నియోజకవర్గం మొదటి రౌండ్ నుంచి బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ ఆధిక్యం ప్రదర్శించారు. 4,14, 16 17, 21 రౌండ్‌ల లో బీఆర్ఎస్ ఆధిక్యం ప్రదర్శించగా మిగతా 16 రౌండ్లలో బీజేపీ ఎక్కువ ఓట్లు సాధించింది. బోథ్ నియోజకవర్గంలో మొదటి నుంచి బీఆర్ఎస్ ఆధిక్యం కొనసాగింది. చివరి రౌండ్ వరకు అనిల్ జాదవ్ ఆధిక్యం కొనసాగిస్తూ వచ్చారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 21రౌండ్లు ముగిసే సరికి 6,147 ఓట్లతో బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్, బోథ్ నియోజకవర్గంలో 22రౌండ్ల ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సరికి 23,023 ఓట్లతో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ విజయం సాధించారు. ఆదిలాబాద్ నియోజకవర్గం ఆర్వో స్రవంతి, బోథ్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పేయి గెలుపొందిన అభ్యర్థులకు పత్రాలను పంపిణీ చేశారు.

### ప్రజల విజయం



ముఖ్యమంత్రి కేసీఆర్ నాపై విశ్వాసంతో బోథ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే నాయకుడిగా నాకు మంచి పేరు ఉంది. ప్రజలు ఈ ఎన్నికల్లో నాపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారు. ఇది ప్రజల విజయంగా భావిస్తున్నాను. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారికి మరిన్ని సేవలు అందిస్తాను.

*- అనిల్‌జాదవ్, ఎమ్మెల్యే, బోథ్*

# తేలిన ఫలితం

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ విజయం

- మరో మూడు చోట్ల టఫ్ ఫైట్ ఇచ్చిన బీఆర్ఎస్ నాయకులు
- నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్.. మరో నాలుగు చోట్ల బీజేపీ గెలుపు
- సిర్పూర్ కాగజ్‌నగర్‌లో బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఓటమి
- తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నవారు ఏడుగురు

మంచిర్యాల, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెల్లడయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. ఆసిఫాబాద్‌లో కోవ లక్ష్మి 22,810 ఓట్లు, బోథ్‌లో అనిల్ జాదవ్ 23,023 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ నాలుగు నియోజకవర్గాల్లో విజయం సాధించింది. చెన్నూర్‌లో గడ్డం వివేక్, బెల్లంపల్లిలో గడ్డం వినోద్, మంచిర్యాలలో ప్రేమ్‌సాగర్‌రావు, ఖానాపూర్‌లో వెడ్మ బొజ్జు గెలుపొందారు. నిర్మల్‌లో బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్‌లో రామారావుపటేల్, ఆదిలాబాద్‌లో పాయల్ శంకర్, కాగజ్‌నగర్ పాల్వాయి హరీశ్‌బాబు విజయం సాధించారు. సిర్పూర్, ఖానాపూర్, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ గట్టి పోటీని ఇచ్చింది. చివరి రౌండ్ ఓట్ల లెక్కింపు వరకు ఉత్కంఠగా ఎదురు చూడాల్సి వచ్చింది. ఈ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు స్వల్ప తేడాతో ఓడిపోయారు. అనూహ్యంగా ఈ మూడు నియోజకవర్గాల్లో రెండు చోట్ల బీజేపీ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఘోర పరాజయాన్ని చవి చూశారు. ఇక్కడ అతి తక్కువ మెజార్టీతో బీజేపీ గెలిస్తే, బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలిచింది. బీఎస్పీ మూడోస్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది.

### తక్కువ తేడాతో మూడు..

ఉమ్మడి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ స్వల్ప తేడాతో సీట్లను కోల్పోయింది. ఖానాపూర్ నియోజకవర్గంలో 4,966 ఓట్ల తేడా వచ్చింది. బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు 53,721 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జుకు 56,687 ఓట్లు వచ్చాయి. కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ గెలిచినంత పని చేసింది. ఇక్కడ కేవలం 3,223 ఓట్లతో బీఆర్ఎస్ అభ్యర్థి కోనప్ప గెలుపునకు దూరంగా ఉండిపోయారు. ఇక్కడ బీజేపీకి 63,402 ఓట్లు రాగా బీఆర్ఎస్‌కు 60,169 ఓట్లు వచ్చాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి నెక్ టూ నెక్ పోటీ వచ్చింది. చివరకు 6,147 ఓట్లతో బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ గెలిచారు. ఈ మూడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అతి దగ్గర వరకు వచ్చి ఓటమి చూడాల్సి వచ్చింది.



ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి విజయోత్సావ ర్యాలీ

### ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం..



ఈ ఎన్నికల్లో చెన్నూర్ ప్రజలు ఇచ్చిన తీర్పును తాను గౌరవిస్తున్నానని చెన్నూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ అన్నారు. కౌంటింగ్ సెంటర్ నుంచి బయటికి వచ్చిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. గత ఎన్నికల్లో గెలిపించి ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని 100 శాతం ప్రజా సేవకు కేటాయించానన్నారు. చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేశానన్నారు. ఏదేమైనా ప్రజల తీర్పుకు కట్టుబడి ఉన్నామన్నారు. గెలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదిశగా పని చేయాలని ఆకాంక్షించారు.

*- బాల్క సుమన్, చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి.*

### సిర్పూర్ నియోజకవర్గం

బీఆర్ఎస్ : కోనేరు కోనప్ప - 60,614
బీజేపీ : పాల్వాయి హరీశ్‌బాబు - 63,702
బీఎస్పీ : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ - 44,008
బీజేపీకి మెజార్టీ - 3,088

### చెన్నూర్ నియోజకవర్గం..

బీఆర్ఎస్: బాల్క సుమన్ -50,026
కాంగ్రెస్: వివేక్ వెంకటస్వామి-87,541
బీజేపీ: దుర్గం అశోక్ -3,375
కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ -37,515

### ఆసిఫాబాద్ నియోజకవర్గం

బీఆర్ఎస్: కోవ లక్ష్మి - 83,052
కాంగ్రెస్: అజ్మీరా శ్యామ్‌నాయక్ - 60,242
బీజేపీ: ఆజ్మీరా ఆత్మారాంనాయక్ -6,613
బీఆర్ఎస్ పార్టీకి మెజార్టీ - 22,810

### బోథ్ నియోజకవర్గం..

బీఆర్ఎస్ : అనిల్ జాదవ్- 76,297
బీజేపీ : సోయం బాపురావ్- 53,274
కాంగ్రెస్ : ఆడె గజేందర్ - 32,426
బీఆర్ఎస్ పార్టీకి మెజార్టీ - 23,023

### ఆదిలాబాద్ నియోజకవర్గం..

బీఆర్ఎస్ : జోగు రామన్న - 60,321
బీజేపీ : పాయల్ శంకర్ - 66,468
కాంగ్రెస్ : కంది శ్రీనివాస్‌రెడ్డి - 46,763
బీజేపీ పార్టీకి మెజార్టీ - 6,147

### ముథోల్ నియోజకవర్గం..

బీఆర్ఎస్ : విఠల్‌రెడ్డి- 73,380
బీజేపీ : రామారావు పటేల్ - 96,799
కాంగ్రెస్ : నారాయణరావు పటేల్ - 15,394
బీజేపీ పార్టీకి మెజార్టీ - 23,419

### నిర్మల్ నియోజకవర్గం..

బీఆర్ఎస్ : ఇంద్రకరణ్‌రెడ్డి- 55,867
బీజేపీ : ఏలేటి మహేశ్వర్‌రెడ్డి - 1,06,313
కాంగ్రెస్ : శ్రీహరిరావు- 28,332
బీజేపీకి మెజార్టీ - 50,446

### బెల్లంపల్లి నియోజకవర్గం..

కాంగ్రెస్ : గడ్డం వినోద్ - 82,217
బీఆర్ఎస్ : దుర్గం చిన్నయ్య - 45,339
బీజేపీ : అమర్‌రాజుల శ్రీదేవి -3,812
కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ - 36,878

### మంచిర్యాల నియోజకవర్గం

కాంగ్రెస్ : ప్రేమ్‌సాగర్‌రావు - 1,05,940
బీజేపీ : ఎర్రవెల్లి రఘునాథ్ - 39,829
బీఆర్ఎస్ : దివాకర్‌రావు -37,989
కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ - 66,111

### ఖానాపూర్ నియోజకవర్గం..

బీఆర్ఎస్ : జాన్సన్ నాయక్ - 54,152
కాంగ్రెస్: వెడ్మ బొజ్జు - 58,855
బీజేపీ: రమేశ్ రాథోడ్ - 52,378
కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ - 4,703

# ఖానాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం

- ఎమ్మెల్యేగా వెడ్మ బొజ్జు గెలుపు
- స్వల్ప తేడాతో ఓడిన బీఆర్ఎస్ అభ్యర్థి



గెలుపు పత్రం అందుకుంటున్న వెడ్మ బొజ్జు

ఉట్నూర్/కడెం,డిసెంబర్ 3: ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు గెలుపొందారు. 30 ఏండ్ల తర్వాత నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగిరింది. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన కౌంటింగ్‌లో, మూడు పార్టీల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగింది. చివరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెడ్మ బొజ్జు 4703 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌పై గెలుపొందారు. ఈ సందర్భంగా అభ్యర్థి వెడ్మ బొజ్జు మీడియాతో మాట్లాడుతూ పేదరికంలో ఉన్న తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించిందని, అలాగే ఖానాపూర్ ప్రజలు కూడా తనను గెలిపించారని పేర్కొన్నారు. ప్రజల మన్ననలు పొందేందుకు ప్రయత్నిస్తానన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. గెలుపు అనంతరం ఖానాపూర్ రిటర్నింగ్ అధికారి జీవాకర్‌రెడ్డి చేతుల మీదుగా గెలుపు పత్రం అందుకున్నారు. ఖానాపూర్ నియోజకవర్గానికి మొత్తం 1,72,412 ఓట్లు పోల్ కాగా, వాటిని 22 రౌండ్ల వారీగా లెక్కించారు. మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాగా, కాంగ్రెస్ అభ్యర్థి బొజ్జుపటేల్‌కు 58855, బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ 54152, బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేశ్‌కు 52378, బీఎస్పీ అభ్యర్థి బన్సిలాల్ రాథోడ్‌కు 1688, స్వంతత్ర అభ్యర్థులు బొంత అశారెడ్డి 1068, కూతాటి విజయ 172, జాదవ్ ప్రభాస్ 265, పెందూరి ప్రియాంక 363, ఆత్రం రవీందర్ 1245, నేతావత్ రాజేందర్ 1293, మోహన్ 573, నోటాకు 2096 ఓట్లు నమోదయ్యాయి. కాంగ్రెస్‌కు 687 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి మొత్తం 4703 ఆధిక్యం దక్కింది.

## ముథోల్ ఎమ్మెల్యేగా రామారావు పటేల్ విజయం

**- హోరా హోరీగా సాగిన పోరు**



విజయ సంకేతం చూపుతున్న రామరావు పటేల్

భైంసా, డిసెంబరు 3: ముథోల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన కౌంటింగ్‌లో ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి రామారావు పటేల్ దాదాపు 23,419 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ముథోల్‌లో మొత్తం ఓటర్లు 2,49,554 ఉండగా 2,00,486 ఓట్లు పోలయ్యాయి. దీంట్లో రామారావు పటేల్‌కు 96,799, విఠల్ రెడ్డికి 73,380, కాంగ్రెస్ అభ్యర్థి నారాయణ రావు పటేల్‌కు 15,394 రాగా, 23,419 ఓట్ల మెజార్టీతో రామారావు పటేల్ గెలుపొందారు.

### ప్రజా తీర్పును గౌరవిస్తున్నా..



నిర్మల్ అర్బన్, డిసెంబర్ 3: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజా తీర్పును గౌరవిస్తున్నానని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. 35 ఏండ్లకు పైగా నిర్మల్ నియోజిక వర్గ ప్రజలు వారికి సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.ఎన్నికల్లో అహర్నిషలు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

*-మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి*

## బీఎస్పీ అధినేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఓటమి



ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : బహుజన సమాజ్‌వాది పార్టీ అధినేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం వెల్లడించిన ఎన్నికల ఫలితాల్లో ఓటమి పాలయ్యారు. జనరల్ స్థానమైన సిర్పూర్ నియోకవర్గం నుంచి పోటీలో ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు 44,646 ఓట్లు వచ్చాయి. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులతో పోలిస్తే ఆర్ఎస్ ప్రవీణ్ కుమారు మూడోస్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది. ఏ ఒక్క రౌండ్‌లో కూడా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తన ఆధిక్యతను చాటుకోలేకపోయారు. ఎస్పీ సామాజిక వర్గానికి చెందిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జనరల్ నియోజకవర్గమైన సిర్పూర్ –టీ నియోజకవర్గం నుంచి పోటీచేశారు. ఐపీఎస్ అధికారి అయిన అతని ప్రచారం పట్ల ప్రజలు మొదట ఆసక్తి చూపినప్పటికీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది ప్రజల్లో బీఎస్పీ పట్ల ఆదరణ తగ్గింది. ఒక సమయంలో ఎన్నికల్లో బీఎస్పీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గెలుపు ఖాయమన్న ఊహాగానాలుకూడా వెలువడ్డాయి. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు నుంచి బీఆర్ఎస్పీకి ప్రజాదారణ తగ్గుముఖం పట్టింది. 23 రౌండ్‌లలో సాగిన కౌంటింగ్‌లో బీజేపీ– బీఆర్ఎస్ మధ్యే పోటాపోటీ ఆధిపత్యం కొనసాగింది.

# గుబాళించిన గులాబీ

- సిర్పూర్‌లో బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు
- స్వల్ప తేడాతో కోనేరు కోనప్ప ఓటమి
- వినూత్న తీర్పునిచ్చిన జిల్లా ప్రజలు
- జిల్లాలో కాంగ్రెస్‌కు దక్కని చోటు
- బీఆర్ఎస్ విజయోత్సవ ర్యాలీ
- ప్రజలందరికీ రుణపడి ఉంటా : కోవ లక్ష్మి

## ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి గెలుపు



విజయోత్సవ ర్యాలీ పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి


ఆసిఫాబాద్/ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 3 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ప్రజలు వినూత్న తీర్పునిచ్చారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి.. కాంగ్రెస్ అభ్యర్థి ఆజ్మీరా శ్యాంనాయక్‌పై 22,810 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు.. బీఆర్ఎస్ అభ్యర్థి కోనప్పపై 3,088 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇక కాంగ్రెస్‌కు జిల్లాలో చోటు దక్క లేదు.

### అన్ని రౌండ్లలోనూ కోవలక్ష్మి ఆధిక్యం

నియోజకవర్గంలో 2,26,664 ఓటర్లుండగా, 1,83,534 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో కోవలక్ష్మికి 83,052 ఓట్లు రాగా, ఆజ్మీరా శ్యాంనాయక్‌కు 60,242 ఓట్లు వచ్చాయి. మొదటి రౌండ్ నుంచి కోవలక్ష్మి ఆధిక్యం ప్రదర్శించారు. మొదటి రౌండ్‌లో 779, రెండో రౌండ్‌లో 457,మూడో రౌండ్‌లో 1184, నాలుగో రౌండ్‌లో 2740, ఐదో వ రౌండ్‌లో 1876, ఆరో రౌండ్‌లో 1197, ఏడో రౌండ్‌లో 297, ఎనిమిదో రౌండ్‌లో 507, తొమ్మిదో రౌండ్‌లో 4574, పదో రౌండ్‌లో 1817, పదకొండో రౌండ్‌లో 1266, పన్నెండో రౌండ్‌లో 2421, పదమూడో రౌండ్‌లో 1025, పద్నాలుగో రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థికి 596 లీడ్ వచ్చింది. పదిహేనో రౌండ్‌లో మాత్రం కాంగ్రెస్‌కు 1189 లీడ్‌లో వచ్చింది. పదహారో రౌండ్‌లో మళ్లీ బీఆర్ఎస్‌కు 952 లీడ్ వచ్చింది, పదిహేడో రౌండ్‌లో కాంగ్రెస్‌కు 592, పద్దెనిమిదో రౌండ్‌లోనూ కాంగ్రెస్‌కు 10 లీడ్ వచ్చింది. మళ్లీ పందొమ్మిదో రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 2343, 20వ రౌండ్‌లో 515, 21వ రౌండ్‌లో 455, 22వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 33 లీడ్ వచ్చింది. చివరి రౌండ్‌కల్లా మొత్తంగా బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి 22,810 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

### ఉరకలేసిన ఉత్సాహం

ఆసిఫాబాద్ గడ్డపై గులాబీ గుబాళించింది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోవలక్ష్మి అత్యధిక మెజార్టీతో గెలుపొందడంతో కార్యకర్తలు, నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, అభిమానుల్లో ఉత్సాహం ఉరకలేసింది. కౌంటింగ్ కేంద్రం నుంచి ప్రధాన వీధులగుండా కోవలక్ష్మి ఇంటి వరకు విజయోత్సవ ర్యాలీ తీశారు. చిల్డ్రన్‌పార్కులో కోవ లక్ష్మి తండ్రి మాజీ మంత్రి కోట్నాక భీంరావు, కుమ్రం భీం విగ్రహాలకు, తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యకర్తలు డీజే పాటలతో నృత్యాలు చేశారు. పటాకులు కాల్చుతూ మిఠాయిలు పంపిణీ చేశారు. కోవలక్ష్మి,ఆత్రం సక్కు, కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ర్యాలీలో దాదాపుగా 15 వేల మంది పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్ర్కీన్ ఏర్పాటు చేసి ఫలితాలను ప్రదర్శించారు.



ఎన్నికల ధృవీకరణ పత్రం అందుకుంటున్న కోవ లక్ష్మి

### పాల్వాయి హరీశ్‌బాబు తొలిగెలుపు

సిర్పూర్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి కోనేరు కోనప్పపై 28 వేల ఓట్లతో తేడాతో ఓటమి పాలయ్యారు. 2023లో బీజేపీ నుంచి పోటీ చేసిన హరీశ్ స్వల్ప మెజార్టీతో గెలుపొంది మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు.

### ప్రజలకు రుణపడి ఉంటా : కోవలక్ష్మి

తనను ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికీ రుణపడి ఉంటానని బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి తెలిపారు. ఫలితాల విడుదల తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ తనకు మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చారని, మొదటిసారి 2014లో 19 వేల మెజార్టీతో గెలిపించానని, రెండోసారి 171 ఓట్ల తేడాతో ఓటమి చెందానని చెప్పారు. మూడోసారి అత్యధికంగా 22,810 మెజార్టీతో గెలిపించిన ప్రజలందరికీ సేవ చేసుకుంటానన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు, చెల్లె మర్సుకోల సరస్వతి కృషి మరువలేనిదన్నారు. నా గెలుపు కోసం రాత్రీ.. పగలూ కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులు, అభిమానులను జీవితాంతం గుర్తుంచుకుంటానని చెప్పారు. ఎస్టీ,ఎస్సీ,బీసీ,మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతానని చెప్పుకొచ్చారు.



మాజీమంత్రి కోట్నాక భీంరావ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కోవలక్ష్మి